# అల్లుకున్న ప్రమాదం

- ట్రాన్స్‌ఫార్మర్లపై ఎగబాకిన చెట్లకొమ్మలు
- వేలాడుతున్న విద్యుత్ తీగలు
- పట్టించుకోని అధికారులు

**బెల్లంపల్లి విద్యుత్‌శాఖ వివరాలు..**

| | |
|---|---|
| విద్యుత్ సబ్‌స్టేషన్లు | 02 |
| ట్రాన్స్‌ఫార్మర్లు | 239 |
| విద్యుత్ కనెక్షన్లు | 18,800 |


బాబుక్యాంపు బస్తీ రోడ్డుపక్కన ట్రాన్స్‌ఫార్మర్‌ను కప్పేసిన తీగజాతి మొక్కలు

**బెల్లంపల్లి:** పట్టణంలో విద్యుత్ తీగలు కిందికి వేలాడుతున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్లపై చెట్లకొమ్మలు ఎగబాకి, తీగజాతి మొక్కలు అల్లుకుని ప్రమాదకరంగా ఉన్నాయి. వీటిని తొలగించాల్సిన సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. పట్టణంలోని 34 వార్డుల్లో ఈవిధమైన పరిస్థితి ఉంది. చెట్లకొమ్మలు, తీగజాతి మొక్కలు నరికివేయించాల్సి ఉన్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. చిరుగాలి వీస్తే చాలు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని వినియోగదారులు పేర్కొంటున్నారు. కరెంట్ సమస్య ఏర్పడిన ప్పుడు అత్యవసర వేళలో బ్రేకటింగ్ చేయించి మిగితా ప్రాంతాలను విస్మరిస్తున్నారు. అధికారులు, సిబ్బంది తీరు కారణంగా ఇబ్బందులు పడుతున్నామని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రతి వార్డులోనూ..**

ప్రతి వార్డులోనూ ప్రమాదకరంగా కరెంట్ తీగలు వేలాడుతున్నాయి. చాలాచోట్ల మిడిల్స్ పోల్స్ ఏర్పాటు చేయడం లేదు. కొన్ని ప్రాంతాల్లో తీగల మధ్య, పక్కకు వృక్షాలు ఏపుగా పెరిగి ఉండటం, స్తంభాలు వంకర టింకరగా ఏర్పాటు చేయడం వల్ల తీగలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. పలుచోట్ల ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచె ఏర్పాటు చేయలేదు.

**సబ్‌స్టేషన్లలోనే మెయింటనెన్సా?**

నెలలో ప్రతి రెండో, నాల్గో శనివారాల్లో మెయింటనెన్స్ పనులు నిర్వహించాల్సి ఉంటుంది. అయితే ప్రతిసారి శివాలయం, కాల్‌టెక్స్ ఏరియాలో ఉన్న సబ్‌స్టేషన్లలో పనులు నిర్వహిస్తున్నారు తప్పా ట్రాన్స్‌ఫార్మర్లు, కరెంట్ తీగల గురించి పట్టించుకోవడం లేదు. గాలికి వదిలేసి చోద్యం చూస్తున్నారు. కాగా నిర్దేశించిన ప్రకారంగా వ్యవహరించడం లేదు. గంటల తరబడి సరఫరా నిలిపివేసి మెయింటనెన్స్ పనులు చేపడుతున్నామని చెప్పడం సర్వసాధారణంగా మారింది.

## సరిపడా లేని సిబ్బంది

విద్యుత్ సిబ్బంది సరిపడా లేకపోవడం సమస్యలకు కారణమవుతోంది. పట్టణ పరిధిలో కనిష్టంగా 25 మందికి తగ్గకుండా సిబ్బంది ఉండాల్సి ఉండగా ప్రస్తుతం ఏడుగురు మాత్రమే పనిచేస్తున్నారు. ఇద్దరు లైన్ ఇన్‌స్పెక్టర్లకు ఒకరు మాత్రమే ఉన్నారు. నలుగురు లైన్‌మెన్లకు గాను ఇద్దరు విధులు నిర్వర్తిస్తున్నారు. ఆరుగురు ఉండాల్సిన అసిస్టెంట్ లైన్‌మెన్లకు ఇద్దరు ఉన్నారు. జూనియర్ లైన్‌మెన్ ఒకరు కూడా లేరు. తగిన సిబ్బందిని నియమించడంలో అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి సిబ్బందిని నియమించడంతోపాటు ట్రాన్స్‌ఫార్మర్లు, కరెంట్ తీగలపై వేలాడుతున్న చెట్లకొమ్మలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని పురప్రజలు కోరుతున్నారు.

## చర్యలు తీసుకుంటాం

ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ తీగలపై వాలిన చెట్లకొమ్మలు, అల్లుకున్న తీగజాతి మొక్కలను కట్ చేయించేందుకు చర్యలు తీసుకుంటాం. సిబ్బంది కొరత వల్ల జాప్యం జరుగుతోంది. ట్రాన్స్‌ఫార్మర్లపై ఎగబాకిన కొమ్మలు గుర్తించి, కరెంట్ తీగలు సరిచేసేలా చర్యలు తీసుకుని మెరుగైన విద్యుత్ సరఫరా అందిస్తాం.

– మల్లేశం, విద్యుత్‌శాఖ ఏఈ, బెల్లంపల్లి


ఎంపీడీవో కార్యాలయం వెనుక...


ఇందిరానగర్ కాలనీలో...

## విద్యుత్ స్తంభాలు ప్రమాదకరం

**చెన్నూర్:** చెన్నూర్ మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. లైన్‌గడ్డ, ఇందిరానగర్ కాలనీల్లో రోడ్డు మధ్యలో ఇనుప స్తంభాలు ఉన్నాయి. డ్రెయినేజీలు, మూలమలుపు ప్రాంతాల్లో ఏర్పాటు చేయడంతో పిల్లలు ముట్టుకుంటే విద్యుత్ షాక్ గురయ్యే ప్రమాదం ఉందని ఆయా కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. ఎంపీడీవో కార్యాలయం వెనుక కాలనీలో రోడ్డుకు మధ్యన స్తంభం ఉంది. రాత్రి సమయంలో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకుని ఇనుప స్తంభాలు, ప్రమాదకరంగా ఉన్నవి తొలగించి సిమెంట్‌వి ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.


లైన్‌గడ్డ కాలనీలో డ్రెయినేజీలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభం

## క్లుప్తంగా

### నేటి నుంచి పత్తి కొనుగోళ్లు పునఃప్రారంభం

**చెన్నూర్:** చెన్నూర్ వ్యవసాయ మార్కెట్ పరిధిలోని ఐదు జిన్నింగ్ మిల్లులలో సోమవారం నుంచి జిల్లా జాయింట్ కలెక్టర్ మోతిలాల్ ఆదేశాల మేరకు పత్తి కొనుగోళ్లను పునః ప్రారంభిస్తున్నట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి రామాంజనేయులు, సీసీఐ, సీపీవో నాయక్‌లు తెలిపారు. 8 తేమశాతం ఉన్న పత్తికి క్వింటాళ్లు పత్తి ధర రూ.7421 మద్దతు ధర లభిస్తుందని తెలిపారు. పత్తి కొనుగోళ్లను చెన్నూర్, కోటపల్లి, భీమారం, జైపూర్ మండలాల రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రాజ్‌కుమార్

**భీమారం:** మండలంలోని నర్సింగాపూర్‌లో ఆర్‌కే ఫౌండేషన్ ద్వారా ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ని ఆదివారం ఫౌండేషన్ చైర్మన్ బుక్యా రాజ్‌కుమార్ ప్రారంభించారు. క్రీడలను ప్రోత్సహించడానికే క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెద్దల బాపు, సహకార సంఘం డైరెక్టర్ పానుగంటి లక్ష్మణ్‌తో పాటు యువకులు పాల్గొన్నారు.

### పట్టణ కమిటీ రద్దు


మాట్లాడుతున్న రాందాస్

**లక్సెట్టిపేట:** అంబేడ్కర్ యువజన సంఘం పట్టణ కమిటీని రద్దు చేసినట్లు మండలాధ్యక్షుడు ముల్కల్ల రాందాస్, ప్రధాన కార్యదర్శి బైరం రవి తెలిపారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ సంఘం భవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నియమ నిబంధనలు ఉల్లంఘించినందుకు కమిటీ నిర్ణయం మేరకు పట్టణ కమిటీని రద్దు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు లింగన్న, చిప్పకుర్తి నారాయణ, లచ్చన్న, దొంత నర్సయ్య, పురుషోత్తం, దర్మయ్య, వెంకటేష్, రమేష్,రవీందర్, సత్తన్న, రంజిత్, కుమార్, శాంతికుమార్ పాల్గొన్నారు.

### నవోదయ నమూనా పరీక్షకు స్పందన


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

**చెన్నూర్:** చెన్నూర్ శార్వాణి పాఠశాలలో జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఆదివారం ఉచిత నమూనా పరీక్ష నిర్వహించారు. విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. ఎం.స్రవంతి ప్రథమ, జోడు హిమాన్షు, పోలాస సుహాస్ ద్వితీయ, శశికాంత్ తృతీయ స్థానంలో ప్రతిభ కనబర్చారని పాఠశాల కరస్పాండెంట్ మేడ శ్రావణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు బిల్లా తిరుపతయ్య, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### కేఎంపీఎల్ వేలం


వేలంలో పాల్గొన్న ఫ్రాంచైజీలు

**కాసిపేట:** మండలంలో నిర్వహించే ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల వేలం నిర్వాహకులు ఆదివారం మందమర్రి ఇల్లందు క్లబ్‌లో నిర్వహించారు. మండలంలో ప్రతీ సంవత్సరం కాసిపేట మండల ప్రీమియర్ లీగ్(కేఎంపీఎల్) పోటీలు నిర్వహిస్తుండగా, ఈ నెల 19నుంచి ప్రారంభం అయ్యే పోటీలకు టీం లను సిద్ధం చేసేందుకు వేలం నిర్వహించారు. ఇందులో భాగంగా 10ఫ్రాంచైజీలు ప్లేయర్స్‌ను కొనుగోలు చేసి 15రోజుల పాటు పోటీలు నిర్వహిస్తారు. క్రీడకారుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు పోటీలు ఉపయోగపడతాయని, దానిలో భాగంగా ప్రీమియర్ లీగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు దాసరి శంకర్, నామసాని రాజు, మెరుగు శ్రీనివాస్, తిరుపతి, మండలంలోని వివిధ ప్రముఖ ఫ్రాంచైజీలు పాల్గొన్నారు.

### 22న శతాబ్ది ఉత్సవాల సదస్సు



మాట్లాడుతున్న కలవేన శంకర్

**పాతమంచిర్యాల:** సీపీఐ పార్టీ ఆవిర్భవించి 2024 డిసెంబర్ 26కు శతాబ్ద కాలం పూర్తైన సందర్భాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో సీపీఐ పార్టీ శతాబ్ది ఉత్సవాల సదస్సును ఈ నెల 22న నిర్వహించనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. శతాబ్ది ఉత్సవాల సదస్సుకు మేధావులు, ప్రజలు, కార్మికులు, రైతులు, అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు బొల్లం పూర్ణిమ, మేకల దాసు, జోగుల మల్లయ్య, ఖలీందర్ అలీఖాన్, నగేష్, చిప్ప నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

### శబరిమలకు తరలిన అయ్యప్ప స్వాములు


ఇరుముడితో అయ్యప్ప స్వాములు

**జైపూర్:** మండల కేంద్రంలోని భూనీల సమేతా శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ఉదయం అయ్యప్ప స్వాములు ఇరుముడి కట్టుకొని శబరిమలకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా గురుస్వాములు నడిపెల్లి కృష్ణమోహనరావు, అంబల్ల రవి స్వామి నేతృత్వంలో మండలి దీక్ష చేపట్టిన స్వాములకు ఇరుముడి కట్టించి పూజలు చేశారు.

# పనులు నాణ్యతగా చేపట్టాలి

- మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు


వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

**మంచిర్యాలరూరల్(హాజీపూర్):** హాజీపూర్ మండలం గుడిపేట పునరావాస కాలనీ శివారులో నూతనంగా నిర్మిస్తున్న కేంద్రీయ విద్యాలయం(కేవీ) భవన నిర్మాణ పనులను ఆదివారం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు పరిశీలించారు. పనులు నాణ్యతగా చేపట్టాలని సూచించారు. సాగుతున్న పనుల వివరాలను ఆరా తీశారు. కేంద్రీయ విద్యాలయం కోసం సొంత భవనం ఉండాలనే ఉద్దేశంతో రూ.26కోట్లపై చిలుకు నిధులతో సాగుతున్న భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసేలా నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్‌పాండే, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యేను కలిసిన టీఎన్జీవోస్ నాయకులు**

**మంచిర్యాలటౌన్:** టీఎన్జీవోస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావును ఆదివారం ఆయన నివాసంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను ఎమ్మెల్యేకు వివరించగా, ఎల్లవేళలా సహాయ సహకారాలు అందిస్తానని తెలిపినట్లు టీఎన్జీవోస్ సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, కార్యదర్శి భూముల రామ్మోహన్, కేంద్ర సంఘం కార్యదర్శి పొన్న మల్లయ్య, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీపతి బాపురావు, జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి, సంయుక్త కార్యదర్శులు సునీత, శ్రావణ్, మంచిర్యాల యూనిట్ అధ్యక్షుడు నాగుల గోపాల్, చెన్నూర్ యూనిట్ కార్యదర్శి వేణు గోపాల్ పాల్గొన్నారు.

## పెయింటర్స్ సంక్షేమానికి కార్మికశాఖ చొరవ చూపాలి


మాట్లాడుతున్న కమలాకర్

**మంచిర్యాలటౌన్:** పెయింటర్స్ సంక్షేమం కోసం కార్మిక శాఖ చొరవ చూపాలని పెయింటర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు లగిశెట్టి కమలాకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీఎంఎస్ కార్యాలయంలో ఆదివారం పెయింటర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కన్‌స్ట్రక్షన్ మజ్దూర్ సంఘ్ రాష్ట్ర ఇన్‌చార్జి ఆకుల శంకర్ హాజరై మాట్లాడారు. భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ఏర్పడిన బోర్డు కేవలం అలంకారప్రాయంగా ఉందని, కార్మికుల సంక్షేమం కోసం బోర్డు పూర్తిస్థాయిలో నిర్మాణం కావాలన్నారు. బోర్డుకు చైర్మన్, మెంబర్లు లేకుంటే కార్మికుల సమస్యలు ఎవరు పరిష్కరిస్తారని, సంక్షేమ ఫలాలు కార్మికులకు ఎలా అందుతాయని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మంచిర్యాల కార్మిక శాఖ అధికారులు ఒక మూసలో పనిచేస్తున్నారని, కార్మికులతో వర్గాలు సృష్టించే విధంగా పనిచేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో బీఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి మద్దూరి రాజు యాదవ్, కంది శ్రీనివాస్, జె.రాంమోహన్, పెయింటర్ యూనియ న్ కన్వీనర్ రామకృష్ణ, కోకన్వీనర్ స్వామి పాల్గొన్నారు.



## సీసీ రోడ్డు శిథిలం

**దండేపల్లి:** మండల కేంద్రంలో ఐకేపీ కార్యాలయం నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లేందుకు గత కొన్నేళ్ల క్రితం సీసీ రోడ్డు నిర్మించారు. ప్రస్తుతం ఆ రోడ్డు మొత్తం పగుళ్లు తేలి శిథిలమైంది. దీంతో రోడ్డుగుండా నడవడం ఇబ్బందిగా మారింది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కొత్త రోడ్డు వేయాలని స్థానికులు కోరుతున్నారు.

# ప్రతీ కార్యకర్తకు సముచిత స్థానం

- ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్

**జన్నారం:** పార్టీ బలోపేతానికి పని చేసే ప్రతీ కార్యకర్తకు సముచిత స్థానం కల్పిస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సంవత్సరాల కాలంగా పార్టీని నమ్ముకొని పనిచేస్తున్న వారికే మార్కెట్ కమిటీ పదవులు ఇచ్చినట్లు తెలిపారు. మార్కెట్ కమిటీ ఏర్పాటు విషయంలో ఎమ్మెల్యేగా తాను పోటీ చేసే సమయంలో ఎంతో మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు నాపై పలు రకాల విమర్శలు చేశారని పేర్కొన్నారు. నామినేటెడ్ పదవుల ఎంపిక విషయంలో నేను ఎవ్వరి వద్ద కూడా డబ్బులు ఆశించలేదని పేర్కొన్నారు. ఎవరైనా నాపై వచ్చిన ఆరోపణలు రుజువు చేస్తే దేనికైనా సిద్ధమన్నారు. పార్టీ నాయకుల నుంచి కానీ, ప్రతిపక్ష నాయకుల నుంచి కానీ విమర్శలు వస్తే ఊరుకునేది లేదన్నారు. పార్టీని నమ్ముకొని పని చేసే ప్రతీ కార్యకర్తకు అండగా నిలుస్తానని పేర్కొన్నారు. పాలకవర్గం నియామకం విషయంలో ఎవ్వరూ చిన్నతనం చేసుకోవద్దని, ఇంకా స్థానిక సంస్థల ఎన్నికలు, నామినేటెడ్ పోస్టులు ఉన్నాయని, వారికి సముచిత స్థానం కల్పిస్తానని పేర్కొన్నారు. రైతుల ఇబ్బందులు గుర్తించి పరిష్కరించడానికి పాలకవర్గం పనిచేయాలని సూచించారు. మనది రైతు ప్రభుత్వం అని, రైతులకు మేలు జరిగేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు.

**పాలకవర్గం ప్రమాణస్వీకారం..**

వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ ఫసీఉల్లాతో పాటు 16మంది సభ్యులు ఎమ్మెల్యే బొజ్జు పటేల్ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. వారికి శాలువాలు, పూలమాలలతో ఎమ్మెల్యే, మార్కెట్ కమిటీ సిబ్బంది సన్మానం చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రవి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, ప్రధాన కార్యదర్శి మాణిక్యం, సీనియర్ నాయకులు రాజశేఖర్, మోహన్‌రెడ్డి, ఇసాక్, రాకేశ్, ముజ్జు తదితరులు పాల్గొన్నారు.

## అటవీశాఖ నిర్ణయంపై ఎమ్మెల్యే ఆగ్రహం

**జన్నారం:** రాత్రి వేళల్లో వాహనాల రాకపోకల నిషేధంపై టైగర్ ప్రాజెక్టు ఫీల్డ్ డైరెక్టర్ తీసుకున్న నిర్ణయంపై ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు ఇబ్బంది కలిగించేలా రాత్రి పూట 9గంటల నుంచి 6గంటల వరకు వాహనాల రాకపోకలు నిలిపివేయాలని తమ సిబ్బందికి ఆదేశాలు జారీ చేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలకేంద్రంలో ఆదివారం జరిగిన పలు కార్యక్రమాలకు హాజరైన ఆయన విలేకరులతో మాట్లాడారు. శనివారం రాత్రి సుమారుగా 100వాహనాలు ఉట్నూర్ కొత్తగూడెం చెక్‌పోస్టు వద్ద నిలిచిపోవడం వారి ఏకపక్ష నిర్ణయాలకు నిదర్శనం అన్నారు. రాత్రి వేళ ఇప్పటికే భారీ వాహనాలను నిలిపివేయడం వల్ల, ఈ ప్రాంత వ్యాపారం దెబ్బతిన్నదని పేర్కొన్నారు. ఇప్పుడు ఏ వాహనం కూడా వెళ్లకుండా నిలిపివేయాలని ఎఫ్‌డీపీటీ అధికారులకు ఆదేశాలు ఇవ్వడం ఎంతవరకు మంచిదని పేర్కొన్నారు. ఒక వైల్డ్‌లైఫ్ బోర్డు సభ్యుడిగా ఉన్న నాకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రజలకు రాత్రి పూట ఇబ్బంది ఏర్పడుతుందన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగితే ఊరుకునేది లేదన్నారు. ఈ విషయంలో ఇప్పటికే ఎఫ్‌డీపీటీ, డీఎఫ్‌వోలతో మాట్లాడినట్లు తెలిపారు. ఈ విషయాన్ని అటవీశాఖ మంత్రి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి వారి ఆదేశాలు రద్దు అయ్యేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఒక వేళ అటవీశాఖ ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకుండా, ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే ప్రజలతో కలిసి నేను కూడా ఉద్యమానికి దిగుతానని హెచ్చరించారు.


### ధ్యానంతో ప్రశాంతత..

**దండేపల్లి:** ధ్యానంతో ఒత్తిడిని జయించవచ్చని హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యాన కేంద్రం జోనల్ కో–ఆర్డినేటర్ సతీష్, శ్రీహరి పేర్కొన్నారు. దండేపల్లిలో ఆదివారం ధ్యానంపై అవగాహన కల్పించారు.

### వాసవి విజయం టీచర్ క్లబ్ ఎన్నిక

**మంచిర్యాలఅర్బన్:** వాసవి విజయం టీచర్ క్లబ్ మంచిర్యాల జిల్లా ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. వాసవి క్లబ్ 107ఎల్లందుల కిషోర్‌కుమార్ జిల్లా కమిటీని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా కాసం మల్లికార్జున్, కార్యదర్శిగా సురేష్, కోశాధికారిగా నరేందుల క్రిష్ణమోహన్ ఎన్నికయ్యారు.

### 'కఠినంగా శిక్షించాలి'


మాట్లాడుతున్న దూర్కె మోహన్

**పాతమంచిర్యాల:** రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ పాఠశాల హెచ్‌ఎం రాములుపై డిసెంబర్ 21న మతోన్మాద దుండగుల మూక దాడి చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేఖిస్తున్నామని కుల వివక్ష వ్యతిరేఖ పోరాట సమితి జిల్లా కార్యదర్శి దూర్కె మోహన్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘటన జరిగిన ప్రాంతంలో ఉన్న సీసీ పుటేజీల ఆధారంగా దుండగులపై చర్య తీసుకోవాలని, వారిని కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రాజవేణు, సామాజిక న్యాయ వేదిక జిల్లా కన్వీనర్ రంగు రాజేశం, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సంకె రవి, దళిత బహుజన సంఘం నాయకులు పలిగిరి కనక రాజు, దేవి సత్యం, రజక సంఘం నాయకులు పాయిరాల రాములు తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ శ్రీకాంత్‌రెడ్డికి గౌరవ డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న శ్రీకాంత్‌రెడ్డి

**జన్నారం:** లయన్స్‌క్లబ్ రీజియన్ చైర్‌పర్సన్ లయన్ ఏనుగు శ్రీకాంత్ రెడ్డి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. న్యూ ఢిల్లీలో ఇండియా హాబిటాట్ సెంటర్, మేరిల్యాండ్ స్టేట్ యూనివర్సిటీలో జరిగిన కాన్వొకేషన్‌లో ముఖ్య అతిథి అలహాబాద్ ఫార్మర్ జడ్జ్ జస్టిస్ జేడుఖాన్ చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్‌తో పాటుగా స్వర్ణ పతకం అందుకున్నారు. విద్య, సామాజిక సేవ, యువత అభివృద్ధి కోసం చేసిన విశేష కృషికి గుర్తింపుగా ఈ గౌరవం దక్కినట్లు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.